ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఆలూరు నియోజకవర్గంలో ఆరు పరీక్ష కేంద్రాలు
- పరీక్షలకు హాజరుకానున్న 1,980 మంది విద్యార్థులు


డెస్కులపై హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: పదో తరగతి తరువాత ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితానికి మలుపులాంటిది. ఆ రెండేళ్ల విద్యార్థుల సాధనను బట్టి ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం ఉంటుంది. ఎంసెట్, నీట్, ఐఐటీతో పాటు అనేక రకాల పోటీ పరీక్షలలో ఉద్యోగ అవకాశాలకు ఇంటర్ మార్కులే కీలకం. అందుకే విద్యార్థులు తీవ్రంగా కష్టపడి మంచి ఫలితాల కోసం కృషి చేస్తుంటారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షల కోసం ఆలూరు నియోజకవర్గంలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో 1,980 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు పోలీసు స్టేషన్‌కు చేరాయి. పరీక్షలు జరిగే గదులలో సీసీ కెమెరాల నిఘా ఉంచారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, డెస్కుల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయా కళాశాలల పరీక్షల చీఫ్‌లు వెల్లడించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, హొళగుంద, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ మండలాల్లో ఇంటర్ పరీక్ష కేంద్రాలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలో ఉంటుందన్నారు.

గోనెగండ్ల: మండలంలో ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 314 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 227 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, చీఫ్ సూపరింటెండెంట్ సురేష్‌లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: ఇంటర్ విద్యార్థులు భయం వీడి ఏకాగ్రతతో పరీక్షలు రాయలని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కవిత, పీడీఎస్‌ఓ జిల్లా నాయకుడు సురేంద్రబాబు సూచించారు.గురువారం స్థానిక కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించి పెన్నులు, పౌచ్‌లు, వాటర్ బాటిళ్లను అందజేశారు.

తుగ్గలి: స్థానిక కేజీబీవీ విద్యార్థినులు ఈ ఏడాది పత్తికొండలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ సాహీన్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 30మంది, సెకండియర్‌లో 26 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.అనసూయ జూనియర్ కాలేజీ నుంచి ఫస్టియర్ 75 మంది, సెకండియర్‌లో 85 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

కృష్ణగిరి: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సెంటర్ డిపార్ట్‌మెంటల్ అధికారి రాజనాయక్ తెలిపారు. స్థానిక పాఠశాలలో గురువారం ఆయన రెవిన్యూ, పోలీసు అధికారులతో కలిసి పరీక్షా గదులను పరిశీలించారు. ఈయేడాది ఫస్టియర్‌లో 220 మంది, సెకండియర్‌కు సంబంధించి 240 మంది విద్యార్థులు ఈ సెంటర్‌లో పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

దేవనకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 130 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 120 మంది పరీక్ష రాయనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌శర్మ గురువారం తెలిపారు.

చిప్పగిరి: స్థానిక జూనియర్ కాలేజీలో మొదటిరోజు 96 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు.

ఆలూరు నియోజకవర్గంలోని పరీక్ష కేంద్రాలు

పరీక్ష కేంద్రం పేరు	పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆలూరు	443
ఏపీ మోడల్ స్కూల్, ఆలూరు.	387
ప్రభుత్వ జూనియర్ కాలేజ్, హొళగుంద	388
ప్రభుత్వ జూనియర్ కాలేజ్, చిప్పగిరి	165
ప్రభుత్వ జూనియర్ కాలేజ్, దేవనకొండ	210
ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆస్పరి	387

"అన్ని ఏర్పాట్లు చేశాం



ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు అరగంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. దీంతో పరీక్ష రాసే ముందు మానసిక ఒత్తిడి తగ్గుతుంది. పరీక్షకు కేటాయించిన గదిలో హాల్ టికెట్ నంబర్ తొందరగా చూసుకోవచ్చు. అన్ని రూములలో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచాం. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, డెస్కుల వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. – శంకర్‌ప్రసాద్, ప్రిన్సిపాల్, ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: సీఎం జగనన్న ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందిస్తున్నారని 34వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రమేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలో 1135 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఆ స్థలాలపై లబ్ధిదారులకు సర్వహక్కులు కల్పిస్తూ వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తోంది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి గురువారం అధికారులు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని నంచర్ల, దౌల్తాపురం గ్రామంలో పీఆర్‌ఓ చంద్రనాయక్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 545 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు వచ్చినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ చర్యలపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూరు: స్థానిక సచివాలయాలు ఆలూరు–1, 2 పరిధిలో 302 మంది లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను గురువారం జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, నరేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామూహిక వివాహాలకు విరాళం


రూ.50వేలు విరాళం అందిస్తున్న బుసినె విరూపాక్షి

చిప్పగిరి: హొళగుంద మండలంలోని కోగిలతోట గ్రామంలో ఈ నెల 3, 4 తేదీలలో శివ స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాల కార్యక్రమినకి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి గురువారం రూ.50 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా శివస్వాములు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు


మాట్లాడుతున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో వేసవిలో మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మూలింటి రాధమ్మ తెలిపారు. గురువారం ఆస్పరి సచివాలయంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని 8 చేతిపంపులకు మరమ్మతులు చేయించి వాటికి మోటార్లు బిగించి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీటి మట్టం తగ్గిపోయిందన్నారు. గ్రామస్తులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. కేడీసీసీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఈఓఆర్‌డీ సూర్య నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రీ మాత ఆరాధనోత్సవాలు


హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అనిల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గాయత్రీ మాతకు పంచామృతాభిషేకం, గాయత్రీ మహాయజ్ఞం, కలశస్థాపన, కుంకుమార్చన, పూర్ణాహుతి, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శంకరబండ గ్రామంలో గాయత్రీ చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. మండలంలోని ఆస్పరి, చిరుమాన్‌దొడ్డి, హలిగేరి, చిగిళి, బిణిగేరి, నగరూరు, బిల్లేకల్లు, పుటకలమర్రి, ముత్తుకూరు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో రామతీర్థం కిటకిటలాడింది.ఆలయ నిర్వాహకులు రూపామోహన్‌శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం


పోనకలదిన్నెలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేతుల మీదుగా భవనాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. మండల అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన


గురజాలలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బీఎల్‌ఓలు

నందవరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటర్లకు ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఓబులేసు సూచించారు. గురువారం మండల పరిధిలోని గురజాల, ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లోని ఓటర్లకు ఈవీఎం పనితీరుపై బీఎల్‌ఓలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఓటర్లకు ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు ఏ విధంగా వేయాలనే అంశాన్ని క్షుణంగా వివరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

లివర్ మార్పిడి చికిత్సకు రూ.15 లక్షలు మంజూరు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చిన్న మాదన్న చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కర్నూలులోని తన స్వగృహంలో బాధిత కుటుంబసభ్యులకు అందించారు. బాధితుడు చిన్న మాదన్నకు అనారోగ్యంతో లివర్ మార్పిడి అవసరమైంది. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబ పరిస్థితిని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా సాయం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబీకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గోవర్ధనగిరి నాయకులు సురేంద్ర రెడ్డి, జయరాముడు, రంగడు, పుల్లయ్య, గోరంట్ల, మద్దిలేటి, కేశాలు, కేశవ్, శేఖర్, గొల్ల గోపాల్, వెంకటేశ్వర్లు, గువ్వల మద్దిలేటి, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.


నగదు మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం


జనవాహిని మధ్య రథోత్సవం (ఇన్‌సెట్) స్వామివార్ల ఉత్సవమూర్తులు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవాల్లో భాగంగా గురువారం అశేష జనవాహిని మధ్య తిమ్మప్ప, దడేధూళప్ప, యడివళ్ళప్ప స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుంచారు. అనంతరం రథం ముందు హోమం కాల్చారు. అశేష జనవాహిని మధ్య స్వామివార్ల రథోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పేదలందరికీ 'ఆరోగ్య శ్రీ'

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్య శ్రీ పథకాన్ని విస్తరిస్తోందని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ముగతి గ్రామ సచివాలయం-1, -2 పరిధిలో లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్డుల పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిందన్నారు. మండలంలో 17,845 మందికి గానూ 2,883 మందికి హెల్త్ కార్డులను అందజేశారన్నారు. హెల్త్ కార్డులను పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

9972 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు

హాలహర్వి: మండలంలో కొత్తగా 9972 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ కార్డులను ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చేరవేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 3 వేలకు పైగా సాధారణ మరియు ప్రాణాంతక వ్యాధులకు శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించండి

ఆలూరు: తక్కువ సాగునీటితో లాభసాటి వ్యవసాయాన్ని రైతులు ఎంపిక చేసుకోవాలని ఆలూరు క్లస్టర్ ఏపీడీ పద్మావతి రైతులకు సూచించారు. ఆస్పరి మండలం కారుమంచి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంగళాయిదొడ్డి గ్రామంలో రైతు నర్సిరెడ్డి రెండెకరాలలో సాగుచేసిన డ్రాగన్ పండ్ల తోటను ఆమె గురువారం పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ జలకళ బోర్లు, సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, వైఎస్సార్ యంత్రసేవ ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను మంజూరు చేసిందన్నారు. రైతులు పంట ఉత్పత్తుల గిట్టుబాటు ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి రైతు భరోసా కేంద్రాలలో కియోస్క్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలు, కార్మికులు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.


వెంగళాయిదొడ్డిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఏపీడీ పద్మావతి

రైతులకు సున్నా వడ్డీ మంజూరు

మద్దికెర: మండలంలోని రైతులకు 2021–22 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 2,513 మంది రైతులకు రూ.65,53,544, రబీ సీజన్లో 433 మంది రైతులకు రూ.9,77,630 సున్నా వడ్డీ పంట రుణాలు మంజూరైనట్లు ఏఓ రవి తెలిపారు. గురువారం సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి జాబితాను ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించారు. రైతులు జాబితాలో తమ పేర్లు చూసుకోవాలని సూచించారు.


లబ్ధిదారుల జాబితా ప్రదర్శిస్తున్న దృశ్యం

శివ భక్తులకు అల్పాహారం

హొళగుంద: శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న కన్నడ భక్తులకు గురువారం బళ్లారి రోడ్డులో హొళగుంద వీరశైవ లింగయత యువకులు అల్పాహారం, భోజనం అందించారు.

మహాశివరాత్రి నాడు శ్రీశైల మల్లన్నను దర్శించుకోవడానికి బయలుదేరిన కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తాళూరు, ఊళూరు, బల్లూరు, శిరిగేరికి చెందిన దాదాపు 350 మందికి పైగా భక్తులు మల్లేశ్వరుని నామస్మరణతో హొళగుంద మీదుగా పాదయాత్రగా తరలివెళ్లారు. వారికి వీరశైవ లింగాయుతులు స్థానిక బళ్లారి రోడ్డులో అల్పాహారం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన భక్తులకు దాత సిద్దమల్లగౌడ్ తదితరులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలూరు, ఆస్పరి మీదుగా నాగలాపురం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా చేరుకుంటామని కర్ణాటక భక్తులు తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ఆలూరు రూరల్: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరేంద్ర కుమార్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడారు. 5 సంవత్సరాలలోపు చిన్నారులకు విధిగా మార్చి 3, 4, 5 తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో చుక్కలు వేయించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. అదే విధంగా బస్టాండ్లు, వలస కూలీలు, వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు, పొలాల్లో పనిచేసే వారి పిల్లలను గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. మండలంలో 24 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పింఛన్ సొమ్ము రూ.2.32 కోట్లు మంజూరు

తుగ్గలి: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 7,818 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.2,32,89,000 సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం వేకువజాము నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నగదు పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. లబ్ధిదారుల ఇంటి తలుపులు తట్టి పింఛన్ కానుకను అందజేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి చెప్పారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి సీఐ సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం రాత్రి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, నేరచరిత్ర కలిగిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో గురువారం జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 33 మంది కౌన్సిల్ సభ్యులకు గాను 14 మంది మాత్రమే హాజరుకావడంతో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 5వ తేదీన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురువ ఎద్దుపెంట నాగరాజు (34) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డితోపాటు పలువురు నాయకులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మంచి కార్యకర్తను కోల్పోయామని, బాధిత కుటుంబానికి అండగా ఉండామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట మస్తాన్‌వలి ఉరుసులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 97051 66401, 90100 23540 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం


భక్తజన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

పత్తికొండటౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని పూలతో అలంకరించి, ఉత్సవ విగ్రహాలను అందులో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం నిర్వహించే తేరుబజారు జనాలతో కిక్కిరిసిపోయింది. పెద్ద ఆంజనేయస్వామి దేవాలయం నుంచి తేరుబజారు, పెద్దమసీదు, చక్రాళ్ల రోడ్డు వరకు పెద్ద ఎత్తున ప్రజలు భవనాలు ఎక్కి రథోత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన ఇంటినుంచి ప్రధాన రోడ్డు వెంట తేరుబజారు వరకు పార్టీ శ్రేణులతో కలసి భారీ ర్యాలీగా వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రథానికి కొబ్బరికాయ కొట్టి పూజలు చేసి, రథోత్సవాన్ని ప్రారంభించారు. జూనియర్ సివిల్‌జడ్జి దివ్య రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ నారాయణదాసు, నాయకులు శ్రీరంగడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులుబందోబస్తు చేపట్టారు.


పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

శాస్త్రోక్తంగా దేవతామూర్తుల విగ్రహప్రతిష్ట

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగుల మల్లికార్జున స్వామి దేవాలయంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు గురువారం పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య పార్వతీదేవి, గణపతి, సుబ్రమణ్యేశ్వర, నందీశ్వర, నాగదేవత, ధ్వజస్తంభ, సుంకులా పరమేశ్వరీ, నాభిశిల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతిష్ట సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆలయాన్ని సందర్శించి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


బొందిమడుగులలో ప్రతిష్టించిన పార్వతీదేవి విగ్రహం

ఆర్టీఐ చట్టానికి తూట్లు

ఆలూరు రూరల్: సమాచార హక్కు చట్టం కింద 2021 నుంచి 2024 వరకు చిప్పగిరి గ్రామ పంచాయతీలో ఖర్చు చేసిన నిధులు, వివిధ పన్నుల కింద వచ్చిన నిధుల సమాచారం అడిగితే పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్డీ, మండల ఎంపీడీఓ సరైన వివరాలు ఇవ్వడం లేదని చిప్పగిరికి చెందిన గోవిందన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గురువారం ఆలూరులో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ, మండల అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోడంతో గత నెల 18వ తేదీన ఏపీ సమాచార కమిషన్‌కు ఆర్టీఐ యాక్ట్ కింద దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 27వ తేదీలోపు సమాచారం ఇవ్వాల్సి ఉండగా ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారుల తీరుపై త్వరలో చిప్పగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు గోవిందన్న చెప్పారు.


ఆర్టీఐ కమిషనర్‌కు దరఖాస్తు చేసిన కాపీని చూపుతున్న గోవిందన్న

ఘనంగా ఉరుసు

హాలహర్వి: మండలంలోని కొత్తపేట గ్రామంలో వెలిసిన మస్తాన్‌వలి ఉరుసు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా మస్తాన్‌వలి గుర్రం ఇంటింటికీ తిరుగుతూ భక్తులు సమర్పించిన కానుకలు స్వీకరిస్తూ ముందుకు సాగింది. గుర్రానికి ముడుపులు చెల్లిస్తే మస్తాన్ స్వామి తమ కోరికలు తీరుస్తారని భక్తుల నమ్మకం. శుక్రవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.


మస్తాన్‌వలీ తాత దర్గా

హౌసింగ్ రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ

హాలహర్వి: జగనన్న ప్రభుత్వం పేదలకు ఉచితంగా హౌసింగ్ రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తోంది. దీంతో పేద లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని హాలహర్వి, నిట్రవట్టి గ్రామాల్లో నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందించారు. ఎంపీటీసీ గోపాల్, నిట్రవట్టి వీఆర్వో ఆంజనేయులు, హాలహర్వి వీఆర్వో రామంజిని, పంచాయతీ కార్యదర్శి ఈరన్న చేతులమీదుగా పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై సర్వహక్కులు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందుకోసం ఆ పట్టాలను వారి పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు కన్వేయన్స్ డీడ్స్ అందించిందన్నారు. దేశ చరిత్రలోనే ఇది ఓ చారిత్రాత్మక ఘట్టమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తిమ్మప్ప, యు.లింగప్ప, పరశురామ్, ఉలికోటి, గాదిలింగప్ప, రామంజిని, జయరామ్, గంగాధర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.


నిట్రవట్టిలో రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు